క్లుప్తంగా

స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి



స్కూల్ బస్సు డ్రైవర్లకు సూచనలిస్తున్న సీఐ రామకృష్ణారెడ్డి

తుగ్గలి: స్కూల్ బస్సులు తప్పనిసరిగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాలని పత్తికొండ రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తుగ్గలి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ మల్లికార్జునతో కలిసి ఆదివారం ప్రైవేటు స్కూల్స్ బస్సుల డ్రైవర్లకు వాహన కండిషన్ నిబంధనల గురించి తెలియజేశారు. బడి బస్సుల్లో విద్యార్థులను క్షేమంగా తీసుకొచ్చి అంతే బాధ్యతతో ఇంటికి చేర్చాలన్నారు. అప్రమత్తతతో బస్సులు నడపాలన్నారు. ఎఫ్‌సీ లేకుండా విద్యార్థులను బస్సులో తీసుకెళితే కఠిన చర్యలు ఉంటాయన్నారు.

వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోండి



వైద్య సేవలందిస్తున్న డాక్టర్

మద్దికెర: గ్రామాలలో ఏర్పాటు చేసే వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ మల్లికార్జున, ఉపసర్పంచ్ గోపాల్ సూచించారు. ఆదివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల ప్రజలు వైద్య శిబిరాలలో ఆరోగ్య పరీక్షలు చేయించుకొని తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలకు నాణ్యమైన వైద్య సేవలందిస్తోందన్నారు. ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న అతిథులు

వెల్దుర్తి: స్థానిక గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం విద్యార్థులకు ఉల్లాసం, ఉత్సాహంతో కూడిన విజ్ఞానాన్ని అందించిందని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు తిరివీధి సాయిప్రసాద్ అన్నారు. నెల రోజులుగా గ్రంథాలయాధికారిణి కవితాబాయ్ ఆధ్వర్యంలో ప్రతిరోజు విద్యార్థులకు మంచి పుస్తకాలు చదివేలా ప్రోత్సాహంతోపాటు వివిధ ఆటలు, పాటలు, పోటీలతో నిర్వహించిన శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సాయిప్రసాద్‌తోపాటు, అభివృద్ధి కమిటీ ప్రతినిధి, హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షుడు హరిసింహనాయుడు హాజరయ్యారు. విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. శిబిరం విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ గ్రంథాలయాధికారిణి కృతజ్ఞతలు తెలిపారు.

ఆలూరు: చిన్నారులకు కథల ద్వారా విజ్ఞానం పెంచవచ్చని కవి ఈశ్వరప్ప పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయ శాఖలో వేసవి శిబిరం ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కవి ఈశ్వరప్ప మాట్లాడుతూ.. పుస్తకాలు చదవడం, గేమ్స్, చిత్రలేఖనంతో విజ్ఞానం, ఆలోచనా శక్తి పెరుగుతుందన్నారు.అనంతరం చిన్నారులకు ప్రోత్సాహం బహుమతులను అందజేశారు. మాజీ చైర్మన్ రామమూర్తి, లైబ్రేరియన్, రిటైర్డు ఉపాధ్యాయులు వీరస్వామి, వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి తదితరులు హాజరయ్యారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

హొళగుంద: గజ్జహళ్లి గ్రామంలో ఓ ఇంట్లో విక్రయానికి ఉంచిన కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు ఆదివారం విలేకరులకు తెలిపారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కర్ణాటక నుంచి ఆంధ్రాకు అక్రమంగా మద్యం ప్యాకెట్లు తీసుకొచ్చి అమ్ముతుండగా దాడిలు నిర్వహించినట్లు చెప్పారు. నిందితుడు పరారు కాగా అక్కడున్న 280 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తం

కృష్ణగిరి: వర్షాకాలంలో గ్రామాల్లో ప్రజలు, రైతులు విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో ఏఈ మద్దిలేటి సూచించారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన విద్యుత్ ప్రమాదాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. వర్షంతోపాటు గాలి బలంగా వీచేటప్పుడు, నీటి నిల్వ ఎక్కువ ఉన్న చోట కరెంటు స్తంభాలను తాకరాదన్నారు. అలాగే పొలాల్లో తడిసిన స్టాటర్లను, నీటిలో మునిగిన మోటార్లను ముట్టుకోవద్దని సూచించారు. ఇళ్లలో తడి చేతులతో స్విచ్ బోర్డులను ముట్టుకోరాదని సూచించారు. ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉంటే ప్రమాదాల బారి నుంచి బయటపడవచ్చని వివరించారు.

బడిబాటకు వేళాయె

- ముగిసిన వేసవి సెలవులు
- నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం
- పాఠశాలలకు చేరిన విద్యాకానుక కిట్లు, మధ్యాహ్న భోజన సామగ్రి
- తొలిరోజే విద్యా కానుక పంపిణీకి చర్యలు
- ఎండల తీవ్రత దృష్ట్యా 17 వరకు ఒంటిపూట బడులు



ఆలూరు ప్రభుత్వ బాలుర-1 పాఠశాల

ఆలూరు రూరల్/చిప్పగిరి: వేసవి సెలవులు పూర్తికావడంతో పాఠశాలల పునఃప్రారంభానికి విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం నుంచి తరగతులు మొదలు కానున్నాయి. బడి గంట కొట్టిన రోజే పిల్లలకు పాఠ్యపుస్తకాలు, జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీకి చర్యలు చేపట్టారు. సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెంచడమే కాకుండా మెరుగైన ఫలితాలు రాబట్టేందుకు ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే పలు పథకాలు ప్రవేశపెట్టి పేద విద్యార్థులకు సైతం చదువును అందుబాటులోకి తీసుకొచ్చింది. పాఠశాలల్లో డ్రాపవుట్స్ రేటు తగ్గించేందుకు కృషి చేస్తోంది. పేదరికం చదువుకు అడ్డురాకూడదనే ఉన్నత ఆశయంతో జగనన్న విద్యాకానుక కింద పాఠశాల ప్రారంభం రోజే పిల్లలకు విద్యాసామగ్రి అందించేందుకు సర్వం సిద్ధం చేసింది. ఆలూరు మండలంలో 51 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. 9,196 మంది విద్యార్థులు పాఠశాలలకు హాజరుకానున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఎండ తీవ్రత అధికంగా ఉన్న కారణంగా ఈ నెల 17వ తేదీ వరకు ఒంటి పూట బడులు నిర్వహించనున్నారు. ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 11.30 గంటలకు వరకు విద్యార్థులకు తరగతులు నిర్వహించనున్నారు. అనంతరం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించి ఇంటికి పంపనున్నారు. చిప్పగిరి మండలంలో మొత్తం 25 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 4,200 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.



విద్యార్థులకు పంపిణీ చేయనున్న యూనిఫాం క్లాత్



జగనన్న విద్యాకానుకలోని స్కూల్ బ్యాగ్‌లు

కిట్‌లో ఏముంటాయంటే

విద్యార్థులకు అందించే జగనన్న విద్యాకానుక కిట్‌లో ఒక సెట్ పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, వర్క్‌బుక్స్, ఇంగ్లిష్ టూ తెలుగు డిక్షనరీ, స్కూల్ బ్యాగ్, మూడు జతల యూనిఫాంలు, ఒక జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టు ఉంటాయి. యూనిఫాం కుట్టు కూలీ కోసం ఒకటి నుంచి 8వ తరగతి పిల్లలకు జతకు రూ.120, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు రూ.250 చొప్పున తల్లుల ఖాతాల్లోకి జమచేస్తారు.

పకడ్బందీగా ఏర్పాట్లు



పాఠశాలల పునఃప్రారంభానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేశాం. సంసిద్ధత కింద ఉపాధ్యాయులు శిక్షణ ఇచ్చాం. బడుల్లో పిల్లల సంఖ్య మరింత పెంచేందుకు చర్యలు చేపట్టాం. పాఠశాల తెరుచుకున్న మొదటి రోజు పాఠ్యపుస్తకాలు, జగనన్న విద్యాకానుక కిట్లు అందించేందుకు చర్యలు తీసుకున్నాం. ఈ ఏడాది మరింత నాణ్యతతో జగనన్న కిట్లు వచ్చాయి.

– కోమలాదేవి, ఎంఈఓ, ఆలూరు

పంపిణీకి సిద్ధంగా జేవీకే కిట్లు



మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 4,200 మంది విద్యార్థులకు సరిపడా జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. మధ్యాహ్న భోజనానికి సంబంధించి రాగిజావ, బెల్లం, బియ్యం తదితర సామగ్రి కూడా అందుబాటులో ఉంది. పాఠశాలల పునఃప్రారంభానికి ఒకరోజు ముందే ప్రధానోపాధ్యాయులు ఆయా పాఠశాలలకు వెళ్లి ఏర్పాట్లు సరిచూసుకొని సర్వం సిద్ధం చేశారు.

– ఎంఈఓ మస్తాన్‌రావు, చిప్పగిరి

గతంలో పుస్తకాల పంపిణీలో ఆలస్యం



గతంలో పాఠశాలలు ప్రారంభమై రోజులు, నెలలు గడిచినా కనీసం పాఠ్య పుస్తకాలు కూడా వచ్చేవి కావు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో విద్యాభివృద్ధికి పెద్ద పీట వేశారు. నాడు – నేడు లాంటి కార్యక్రమాలతో ప్రభుత్వ బడుల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. విద్యా సంవత్సరం ప్రారంభం రోజే విద్యార్థులకు అవసరమయ్యే సామగ్రి అందిస్తుండడం హర్షించదగ్గ విషయం. పిల్లల బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తున్న ముఖ్యమంత్రి జగనన్నకు కృతజ్ఞతలు.

– నరసింహులు, నంచర్ల గ్రామం

సకల వసతులతో సిద్ధం

వేసవి సెలవుల అనంతరం తరగతులు పునఃప్రారంభమయ్యే సమయానికి ఆయా పాఠశాలల్లో పూర్తిస్థాయిలో వసతులు కల్పించారు. ఇందుకోసం విద్యాశాఖ అధికారులు అన్ని చర్యలు తీసుకున్నారు. బడి ప్రాంగణం, తరగతి గదులను శుభ్రం చేయించారు. మధ్యాహ్న భోజనం తయారీకి అవసరమైన ఏర్పాట్లు చేశారు. కొత్తగా అడ్మిషన్ పొందే వారికి మరిన్ని సౌకర్యాలు కల్పించారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం



విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న వీఆర్‌ఓ

ఎమ్మిగనూరుటౌన్: గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుంటే విజ్ఞానం పొందవచ్చని వీఆర్‌ఓ జ్యోతి, బాలికల కళాశాల అధ్యాపకులు రంగన్న, డాక్టర్ రాఘవేంద్ర పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరంలో శిక్షణ పొందిన విద్యార్థులకు ఆదివారం గ్రంథాలయాధికారి హరికృష్ణతో కలిసి వారు సర్టిఫికెట్లను అందజేసి మాట్లాడారు. వేసవి శిబిరాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడ్డాయన్నారు. విద్యార్థులు ఉన్నతమైన ఆశయాలతో రాణించాలని సూచించారు. ప్రతి రోజు గ్రంథాలయాలకు వచ్చి దిన, వార పత్రికలతో పాటు పోటీ పరీక్షల పుస్తకాలు, విజ్ఞాన, సాహిత్య చదవడం అలవాటు చేసుకొంటే భవిష్యత్తుకు మంచి మార్గాన్ని చూపుతాయన్నారు. పలువురు ఉపాధ్యాయులు, పాఠకులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కృష్ణగిరి: మండల పరిధిలోని కోయిలకొండ గ్రామ శివారులోని బుగ్గానిపల్లె గోపాల్‌కు చెందిన పొలంలో పేకాట స్థావరంపై ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. దాడుల్లో ఇదే గ్రామానికి చెందిన బోయ పెద్దయ్య, కొడి అన్నెప్ప, దాసదొడ్డి శివయ్య, బోచ రమేష్, బోయిని కృష్ణ, పెద్ద రంగయ్యగారి లోకేలను అరెస్టు చేసి వీరి వద్ద నుంచి రూ.13,500 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మండలంలో ఎక్కడైనా పేకాట, మట్కా ఆడితే తమకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

విత్తన కష్టాలకు చెక్



నాడు – టీడీపీ హయాంలో పాసుపుస్తకాలను క్యూలో ఉంచి వేచిఉన్న రైతులు (ఫైల్)



నేడు – వైఎస్సార్‌సీపీ పాలనలో సీజన్‌కు ముందే విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీదేవి

మద్దికెర: పంట సాగు చేసేందుకు విత్తనాల కోసం అన్నదాతలు రోజుల తరబడి వ్యవసాయ శాఖ అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన రోజులు పోయాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సీజన్ ప్రారంభానికి ముందే గ్రామాల్లోనే విత్తనాలు అందిస్తుండడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా విత్తనాలు పంపిణీకి నోచుకోక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విత్తనాల కోసం రాత్రి, పగలు క్యూలో నిల్చున్నా అందేవి కావు. ఎప్పుడొస్తాయో తెలియదు. టోకెన్లు రాయించుకొని పాసుపుస్తకాలు లైనులో పెట్టి రోజుల తరబడి వేచిచూడాల్సిన పరిస్థితి. పట్టాదారు పుస్తకాలు పోగొట్టుకొని తీవ్ర ఇబ్బందులు పడ్డ సందర్భాలున్నాయి. దిక్కులేని పరిస్థితుల్లో ఇతర పంట సాగు చేసిన తరువాత విత్తనాలు ఇస్తే వాటిని వ్యాపారులకు నష్టానికి అమ్ముకునేవారు. దీనికితోడు మండల కేంద్రంలో మాత్రమే విత్తనాలు ఇస్తుండడం వల్ల వ్యయ ప్రయాసలు పడేవారు. అయితే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. దీంతో ఉన్న గ్రామంలోనే ఆర్బీకేల్లో నమోదు చేసుకొని వ్యయ ప్రయాసలు లేకుండా రైతులు విత్తనాలు తీసుకెళ్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా సీజన్‌కు ముందే విత్తనాలు అందిస్తుండడంపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

విద్యా కానుక సిద్ధం



జేవీకే కిట్లలోని పాఠ్య పుస్తకాలను ప్రధానోపాధ్యాయులకు అందజేస్తున్న ఎంఈఓ

ఎమ్మిగనూరుటౌన్: వేసవి సెలవులు ముగిసి పాఠశాలలు సోమవారం పునఃప్రారంభం కానుండడంతో విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన జగనన్న విద్యా కానుక కిట్లు, పాఠ్య పుస్తకాలను ఎంఈఓ ఆంజినేయులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేశారు. ఆదివారం సోగనూరు రోడ్డులోని జెడ్పీహెచ్ఎస్‌లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు జేవీకే కిట్లను అందజేసి మాట్లాడారు. విద్యార్థుల కోసం 1,68,222 పాఠ్యపుస్తకాలు, 4,577 డిక్షనరీలు, 11,430మంది బాలురు, 12,196 మంది బాలికలకు షూలు, 23,641 స్కూల్ బ్యాగులను ప్రధానోపాధ్యాయులకు అందజేస్తున్నామన్నారు. సోమవారం ఉదయానికి కిట్లలోని వస్తువులన్నింటినీ ఆయా పాఠశాలలకు చేరుస్తామన్నారు. ఆయా జేవీకే కిట్లను పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు పంపిణీ చేయాలని సూచించారు. సీఆర్పీలు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

వెల్దుర్తి: మండలంలోని 61 పాఠశాలలు సోమవారం ప్రారంభంకాగానే విద్యార్థులకు కానుక కిట్లను అందించనున్నారు. మండలవ్యాప్తంగా 9450 మంది విద్యార్థులు జగనన్న విద్యా కానుకను అందుకోనున్నట్లు ఎంఈఓ ఇందిర తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులపై భారం పడకుండా ప్రభుత్వమే నాణ్యమైన విద్యా సామగ్రి అందిస్తుండడంపై వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తుగ్గలి: పాఠశాలలు ప్రారంభమైన మొదటి రోజే (సోమవారం) ప్రతి విద్యార్థికి జగనన్న విద్యా కానుక కిట్లు అందించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంఈఓ రామ వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. మండలంలో 44 ప్రాథమిక, 12 ప్రాథమికోన్నత, 10 జెడ్పీ ఉన్నత పాఠశాలలు ఉన్నాయన్నారు. వీటిలో మొత్తం 7,715 మంది విద్యార్థులు ఉన్నారని చెప్పారు. వీరందరికీ విద్యా కానుక కింద 3 జతల యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, వర్కు బుక్‌లు, నోట్ పుస్తకాలు, బ్యాగు, షూలు, సాక్స్, బెల్టు, డిక్షనరీలు అందజేయనున్నట్లు తెలిపారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించి ఆయా పాఠశాలల హెచ్ఎంలు చౌకదుకాణ డీలర్ల నుంచి బియ్యం తీసుకోవాలన్నారు.

గోనెగండ్ల: మండలంలో 55 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 11,880 మంది విద్యార్థులకు విద్యా కానుక కిట్లను అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఎంఈఓ వినోద్ కుమార్ తెలిపారు. ఇందుకోసం ఇప్పటికే అన్ని పాఠశాలలకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేసినట్లు వెల్లడించారు.

నేటి నుంచి ఏపీఆర్‌జేసీ డీసీ సెట్ కౌన్సెలింగ్

ఎమ్మిగనూరురూరల్: కర్నూల్‌లోని సంతోష్‌నగర్ ఈద్గా దగ్గర ఉన్న ఏపీ రెసిడెన్సియల్ (మైనార్టీ బాయ్స్) పాఠశాలలో ఏపీఆర్‌జేసీ డీసీ సెట్ కౌన్సెలింగ్ సోమవారం నుంచి ప్రారంభం అవుతుందని ఏపీఆర్‌జేసీ సెట్ జిల్లా కన్వీనర్ డాక్టర్ జయం శ్రీనివాసగుప్త ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి విడత కౌన్సిలింగ్‌కు ఎంపికైన విద్యార్థులు https//aprs.apcfss.in వెబ్‌లింక్ ద్వారా మెమో డౌన్‌లోడ్ చేసుకోని అందులో సూచించిన విధంగా సర్టిఫికెట్లు, ఫీజుతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. 12వ తేదీన ఎంపీసీ, ఈఈటీ, 13వ తేదిన బైపీసీ, సీజీడీఎం, 14వ తేదీన ఎంఈసీ, సీఈసీ కోర్సులకు కౌన్సెలింగ్ ఉంటుందని చెప్పారు, 10వ తరగతిలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 50 శాతం, ఓసీ, బీసీ విద్యార్థులు 60 శాతం మార్కులు సాధించి ఉండాలని పేర్కొన్నారు.

ఏపీఆర్‌డీసీ ఎంట్రన్స్‌లో ప్రతిభ

హొళగుంద: మారుమూల గ్రామంలో పుట్టి కష్టపడి చదువుతూ ఆంధ్రప్రదేశ్ రెసిడెన్సియల్ డిగ్రీ కాలేజ్ (ఏపీఆర్‌డీసీ) స్టేట్ ఎంట్రన్స్ టెస్ట్‌లో ఎల్లార్తికి చెందిన విద్యార్థి మాల తిక్కస్వామి ప్రతిభ కనబరిచాడు. ఇటీవల నిర్వహించిన ఎంట్రన్స్ టెస్ట్‌లో తిక్కస్వామి 25వ ర్యాంకు సాధించి శభాష్ అనిపించుకున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన మాల ఉలిగమ్మ, మాల వీరేశ్ దంపతుల రెండో కుమారుడు తిక్కస్వామి టీటీడీ ఆధ్వర్యంలో ఇంటర్ పూర్తి చేసి ఉన్నత చదువు కోసం ఏపీఆర్‌డీసీ ఎంట్రన్స్ టెస్ట్ రాశాడు. ఫలితాల్లో 25వ ర్యాంకు సాధించడం పట్ల గ్రామస్తులు ఆయన్ను అభినందించారు. ఐదేళ్ల క్రితం తిక్కస్వామి తండ్రి వీరేశ్ మరణించడంతో తల్లి ఉలిగమ్మ కొడుకును కష్టపడి చదివిస్తోంది. తల్లి తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పై చదువులు చదివి ఉన్నత స్థాయికి చేరుకుంటానని తిక్కస్వామి పేర్కొన్నాడు.

అయ్యో పాపం బసవన్న



డి.కోటకొండలో కాలువలో ఇరుక్కుపోయిన బసవన్నను బయటికి తీస్తున్న దృశ్యం

ఆస్పరి: డి.కోటకొండ గ్రామంలో పంచాయతీ అధికారులు డ్రైనేజీ కోసం తవ్విన గుంతలో ఆదివారం ఒక ఎద్దు జారిపడి కాలువలో ఇరుక్కుపోయింది. రైతు గోవిందారెడ్డి పొలం పనులను ముగించుకుని ఇంటికి వస్తుండగా ఎద్దు కాలు జారి కాలువలో పడిపోయింది. బెదరిపోయిన ఎద్దును అక్కడున్న గ్రామస్తులు కలిసి అతి కష్టం మీద బయటకు తీశారు. గ్రామంలో 20 రోజుల కిందట డ్రైనేజీ కోసం కాలువ తవ్వారని, పనులు త్వరితగతిన పూర్తిచేయాలని గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి లక్ష్మన్నను కోరారు.


విత్తన డీలర్లపై చర్యలు తీసుకోవాలి



ఎమ్మిగనూరు సోమప్ప సర్కిల్‌లో అధిక ధరల రక్కసి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని విత్తనాలను అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకొనే డీలర్లపై చర్యలు తీసుకోవడంతో పాటు ఆయా విత్తన దుకాణాలను సీజ్ చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపణ్ణగౌడ్, పట్టణ కార్యదర్శి రంగన్న డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో సీపీఐ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించి అధిక ధరల రక్కసి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ మొదలుకావడంతో పట్టణంలో ఎరువులు, విత్తనాల విక్రయాలు జోరందుకున్నాయన్నారు. వాటిని కొనుగోలు చేసేందుకు నియోజకవర్గంలోని మండలాలతో పాటు మంత్రాలయం, రాయచూరు, తెలంగాణ రాష్ట్రంలోని తుంగభద్ర నదీతీరా ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో రైతులు పట్టణానికి వస్తున్నారని చెప్పారు. అమాయక రైతులను మోసగిస్తూ వ్యాపారులు అధిక ధరలకు విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులను విక్రయించి సొమ్ము చేసుకొంటున్నారని ఆరోపించారు. ఎంఆర్‌పీ ధరలపై రూ.500 నుంచి రూ.900 వరకు అధిక ధరకు విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఆయా దుకాణాల వ్యాపారులపై చర్యలు తీసుకొని షాపులను సీజ్ చేయాలని కోరారు. సీపీఐ నాయకులు బాలరాజు, సమీవుల్లా, చిన్నన్న, సత్యన్న, కేసీ జబ్బార్, హనుమంతు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష



ఆలూరు మోడల్ స్కూల్‌లో పరీక్షకు హాజరైన విద్యార్థులు

ఆలూరు రూరల్: మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగినట్లు పరీక్షల చీఫ్ వీరేష్ తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్షకు 265 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 234 మంది హాజరయ్యారు. 31 మంది గైర్హాజరయ్యారు. విద్యార్థుల కోసం స్థానిక మోడల్ స్కూల్‌లో 11 గదులు ఏర్పాటు చేసి అన్ని సౌకర్యాలు కల్పించారు. డిపార్ట్‌మెంటల్ చీఫ్‌గా ఆలూరు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం అర్లమ్మ పర్యవేక్షించారు.

మద్దికెర: స్థానిక ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 84 మందికి గాను 76 మంది హాజరయ్యారని, 8 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ సవిత తెలిపారు. త్వరలోనే ఫలితాలు వెల్లడించి విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తామన్నారు.

నందవరం: ముగతి గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతి ప్రవేశపరీక్షకు 132 మంది ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోగా 125 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు. ఏడుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు వెల్లడించారు.

గోనెగండ్ల: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరవ తరగతి ప్రవేశానికి 308 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 297 మంది విద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపల్ షాహినా పర్వీన్ తెలిపారు. 11 మంది గైర్హాజరైనట్లు చెప్పారు.

ఊపందుకున్న వ్యవసాయ పనులు




మెట్ట పొలంలో మిరప విత్తనాలు విత్తుతున్న అన్నదాతలు



పత్తి విత్తనాలను నాటుతున్న కూలీలు

నందవరం: నైరుతి రుతుపవనాలు విస్తరిస్తున్న వేళ వర్షాలు కురవడంతో పుడమి తల్లి ఒడిలో పంటల సాగుతో సందడి నేలకొంది. నిన్నటివరకు వెలవెలబోయిన పొలాలు నేడు వర్షాల రాకతో పదునెక్కడంతో రైతులు సాగుకు సన్నద్ధమయ్యారు. ఆరుగాలం శ్రమించే రైతన్నలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. వ్యవసాయం పండగలా సాగేలా రైతులకు ప్రతి దశలో అండగా ఉంటున్నారు. సీజన్ ప్రారంభంలోనే రైతులకు వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించారు. ఈ స్థితిలో గత నాలుగు రోజులుగా మండలంలో కురుస్తున్న వానలకు వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఆదివారం సాయంత్రం మండలంలోని గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసింది. దీంతో నందవరం, పూలచింత, జొహరాపురం, నాగలదిన్నె, చిన్నకొత్తిలి, పెద్దకొత్తిలి, గురజాల, రాయచోటి, నదికై రవాడి, హాలహర్వి, ముగతి తదితర గ్రామాల్లో విత్తన పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్‌కు అనుకులంగా వర్షాలు కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నది తీర గ్రామాలు, బోరు బావుల వద్ద దాదాపు 100 హెక్టార్లలో పంటలు సాగు చేశారు. అలాంటి పరిస్థితుల్లో కురిసిన వర్షాలు పంటలకు ప్రాణం పోయగా, సాగు చేయాల్సిన పంటలకు అనుకూలంగా మారడంతో రైతులు విత్తనాలు వేసే పనిలో బిజీగా ఉన్నారు. ఈ వర్షాలకు పత్తి, మిరప, కంది, కొర్ర తదితర పంటలు సాగు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. గత ఏడాదిలో ఎండు మిర్చికి అధిక ధరలు లభించడంతో ఈ ఏడాది రైతులు మెట్ట పొలాల్లో మిరప విత్తనాలు విత్తుతున్నారు. రేగడి (మెట్ట పొలాలు) భూముల్లో సైతం రైతన్నలు ఎండు మిర్చి విత్తనాలు విత్తారు. ఓ మోస్తరుగా కురుస్తున్న వర్షాలకు బోర్ల కింద కొందరు రైతులు సాగు చేసిన పంటలన్నీ ఈ వానలకు ఏపుగా పెరుగుతున్నాయి. మండలంలో దాదాపు 40 శాతం రైతులు పంటల సాగు పనుల్లో నిమగ్నమయ్యారు.

దేవరగట్టులో భక్తిశ్రద్ధలతో పూజలు



దేవరగట్టులో మాళమల్లేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

హొళగుంద: రాష్ట్రంలో దసరా ఉత్సవాలకు ప్రఖ్యాతిగాంచిన దేవరగట్టులో ఆదివారం స్వామి వారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా పూజారులు ఆలయంలోని మూల విరాట్‌కు అభిషేకాలు, సుప్రభాత సేవా, రుద్రాభిషేక, బండరార్చన, కుంకుమార్చన, మహా మంగళారతి, నైవేద్య సంతర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాన్ని అందజేశారు. స్వామివారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు.

శ్రీ మఠంలో చోరీ

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు గత నెల 12న న్యూఢిల్లీకి చెందిన సుజాతరావు,రాజురావు తన కుటుంబ సభ్యులతో కలిసి మంత్రాలయం వచ్చారు. అయితే దర్శనానికి వెళ్లే సమయంలో క్యూలైన్‌లో గుర్తు తెలియని వ్యక్తులు తన హ్యాండ్ బ్యాగును దొంగిలించారని, అందులో దాదాపు రూ.2.50 లక్షలు విలువజేసే బంగారు అభరణాలు ఉన్నాయని, అయితే అత్యవసరం కావడంతో ఆ రోజు ఫిర్యాదు చేయకుండా వెళ్లిపోయామని ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ఆనంద్ రెడ్డి తెలిపారు.

ఉరుకుందలో అగ్ని ప్రమాదం

కౌతాళం: ఉరుకుంద గ్రామంలో ఆదివారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించి రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగింది. గ్రామంలోని దేవాలయం వద్ద వివిధ తినుబండరాలను తయారు చేసుకుని విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న కర్ణాటక వాసులు హరీష్, బస్సమ్మ దంపతులకు చెందిన షెడ్డులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో తినుబండరాల కోసం తెచ్చిన సరుకులతో పాటు ఇంట్లోనున్న సామగ్రి కూడా అగ్నికి ఆహుతి అయ్యింది. అలాగే రూ.50 నగదు కూడా కాలిపోయిందని బాధితులు వాపోయారు.